ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పింఛను కోసం పడిగాపులు



వజ్రమ్మ



చల్లపల్లిలో స్పృహ తప్పి పడిపోయిన వృద్ధుడు



కంచికచర్లలో పింఛను కోసం ఎదురుచూపులు

- సచివాలయాల వద్ద లబ్ధిదారుల తిప్పలు
- కృష్ణాలో ఇద్దరు పింఛనుదారులు మృతి
- చల్లపల్లిలో స్పృహ తప్పిన వృద్ధుడు

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పింఛన్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం తొమ్మిది గంటల నుంచే పింఛన్లు ఇస్తారని భావించిన పింఛనుదారులు గ్రామ, వార్డు సచివాలయాలకు చేరుకున్నారు. అయితే సచివాలయ సిబ్బందికి డబ్బులు అందకపోవడంతో వారు బ్యాంకుల నుంచి డబ్బులు విత్ డ్రా చేయాలని, మధ్యాహ్నం తర్వాత రావాలని చెప్పడంతో లబ్ధిదారులు తిప్పలు పడ్డారు. వృద్ధులు తిరిగి ఇంటికి వెళ్లలేక, ఎండకు మళ్లీ రాలేక అవస్థలు పడ్డారు. సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి సరైన ఏర్పాట్లు చేయకపోగా లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలన్న ఆదేశాలు ఎక్కడా అమలు చేయలేదు. ఫలితంగా వారంతా సచివాలయాల వద్దకు వచ్చి అవస్థలు పడ్డారు. పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన వెంపటి వజ్రమ్మ (80) వడదెబ్బకు మృతిచెందగా, పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన పిల్లి నాగేశ్వరమ్మ (77) పింఛను తీసుకోవడానికి మర్నాడ రమ్మనడంతో మనోవేదనకు గురై మృతిచెందారు. చల్లపల్లి మూడో సచివాలయం ఎస్‌టి కాలనీకి చెందిన పొన్న సుబ్బారావు పింఛను తీసుకునేందుకు వెళ్తూ ఎండ తీవ్రతకు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆయన్ను 108 సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయవాడలో రాత్రి తొమ్మిది గంటల వరకూ పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది.



విజయవాడలో బారులు తీరిన లబ్ధిదారులు

... పూర్తి వార్తలు లోపలి పేజీల్లో

అధికారులపై ఈసీ కొరడా

- జిల్లా కలెక్టర్‌పై వేటుతో కంగుతిన్న అధికార యంత్రం
- దొంగ పట్టాల పంపిణీలో విఆర్‌ఒ సస్పెన్షన్
- అన్ని పక్షాల చూపు పోలీస్ పనితీరుపైనే
- పలు ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం
- ఎన్నికలకు సంబంధించి రెండు కేసులు నమోదు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన అధికారులపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. అధికార పార్టీ నాయకులు కనుసన్నల్లో అధికారులు పనిచేస్తున్నారని విపక్షాల నాయకులు కొందరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడంతో, వాటిని విచారించి బాధ్యులపై చర్యలకు ఉపక్రమించింది. కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబుపై కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో బదిలీ వేటు పడింది. దీంతో జిల్లా అధికారులు కంగుతిన్నారు.

ఎన్నికలకు ముందే అధికార పార్టీ నేతలు తాము ఎన్నికల్లో పోటీ చేసే ప్రాంతాల్లో తమ అనుకూలమైన రెవెన్యూ, పోలీస్ అధికారులను నియమించుకున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారి సహకారంతో విపక్షలను కట్టడి చేసి ఎన్నికల్లో విజయం సాధించాలని వ్యూహరచన జరిగిందని విపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. ఎన్నికల కోడ్ వచ్చినా నిబంధనలకు నీళ్లొదిలి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే అధికారులపై విపక్షాల ఫిర్యాదులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఇప్పటి వరకు 24 మంది వాలంటీర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపైన వేటు పడింది. తాజాగా అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారని ఫిర్యాదులున్న కష్ణాజిల్లా కలెక్టర్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ తాజాగా వేటు వేసింది. ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు వచ్చినా.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం (మిగతా 6లో)

ప్రలోభాలకు తెర !

పెరిశేపల్లిలో రూ.10 లక్షల విలువైన చీరలు స్వాధీనం



పంపిణీకి సిద్ధంగా ఉన్న చీరలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష టిడిపి నేతలు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందు అధికార పార్టీ నేతలు కొందరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ తరగతులకు, వాలంటీర్లకు తాయిలాలు పంచారు. తాజాగా ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు టిడిపి నేతలు పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పామర్రు మండలం పుసుమర్రు గ్రామ సచివాలయ పరిధిలోని పెరిశేపల్లిలో టిడిపి కార్యకర్త చాపరాల వెంకటరమణ ఆధీనంలోని గృహంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు చీరలు నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో వెంకటరమణ ఇంటిని సోదా చేసేందుకు పామర్రు సిఐ సుభాకరరావు నేతృత్వంలో, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ వెళ్లింది. తొలుత వెంకటరమణ ఇంటిని సోదా చేసేందుకు అంగీకరించలేదు. పోలీసుల ఒత్తిడితో రాత్రి రెండు గంటల సమయంలో ఇంటి తాళాలను అందించారు. ఇంటిని సోదా చేసిన పోలీసులు 46 బండెల్స్‌లో ఉన్న 7,680 చీరలను స్వాధీనం చేసుకున్నారు. ఈ చీరల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గ్రామంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో మహిళలకు ఇచ్చేందుకు తెచ్చినట్లు వెంకటరమణ చెబుతున్నారు. అయితే గ్రామంలో కేవలం రెండు వందల జనాభా మాత్రమే ఉండగా ఉత్సవాల్లో ఉపయోగించేందుకు ఏడు వేలకు పైగా చీరలను తీసుకొచ్చినట్లు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. ఈ చీరలు విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టు ద్వారా గ్రామానికి రవాణా అయినట్లు తెలుస్తోంది.

పిఎసిఎస్ సొమ్ముతో కార్యదర్శి పరారీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: శ్రీరాంపురం పిఎసిఎస్‌లో సెక్రటరీగా పని చేస్తున్న వడిమి ప్రభుదాసు బ్యాంకు నగదును తీసుకుని పరారైనట్లు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు విస్సన్నపేట బ్రాంచి మేనేజర్ వి.లక్ష్మీ ప్రసాదు తెలిపారు. శ్రీరాంపురం పిఎసిఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలోనే నగదు బ్యాంకుకు జమ చేశారని, కానీ ఈ నెల రెండో తేదీలోగా విస్సన్నపేటలోని సహకార కేంద్ర బ్యాంకులో నగదు జమ కాలేదని తెలిపారు. దీంతో అక్కడ బాధ్యత చూస్తున్న సెక్రటరీ ప్రభుదాసుకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందని, శ్రీరాంపురం పిఎసిఎస్‌లో రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము సుమారు రూ.30 లక్షలతో పరారయ్యాడని తెలిపారు. దీనిపై రెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

బొమ్ములూరు చెక్‌పోస్టు వద్ద

30 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో 30 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం... సిఐ నరసింహమూర్తి, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఆర్జమ్మ వాహనాలు తనిఖీ చేస్తుండగా పూనేకు చెందిన దీపక్ అబాజీ పుపే, ప్రాసిక్ ప్రసాద్ జాదవ్ విజయనగరం నుండి పూణేకు గంజాయిని కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. దీపక్ అబాజీ పుపేపై గంజాయి అక్రమ రవాణాలో మూడు సార్లు పట్టుబడ్డాడని తెలిసింది. దీంతో గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



దాములూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న జెసి, ఎస్‌పి

అదే సమయంలో బొమ్ములూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వాహన తనిఖీ రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, రవాణా చేస్తున్న వాటికి సంబంధించిన సరైన అనుమతి పత్రాలు, రసీదులు కలిగి ఉండేలా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి జయసూర్య, ఎస్ఐ జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాల్వలకు నీరు విడుదల

6లో



రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : గురువారం సాయంత్రం 6.34

సహర్ : శుక్రవారం ఉదయం 4.46

పింఛన్ల పంపిణీ కేంద్రాల్లో అవస్థలు



దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న ఉపాధ్యాయులకు

మినహాయింపు ఇవ్వాలి

- జిల్లా రెవెన్యూ అధికారికి ఫ్యాప్టో వినతి


ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా రెవిన్యూ అధికారిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ఎన్‌టిఆర్ జిల్లా చైర్మన్ సయ్యద్ ఖాసం, సెక్రటరీ జనరల్ ఇక్బాల్ బాషా మాట్లాడుతూ ఆరు నెలలలోపు పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఎన్నికల కమీషన్ వారి ఆదేశాల ప్రకారం మిహాయింపు ఉందన్నారు. గుండె, కిడ్నీ, క్యాన్సర్, మోకాళ్ల మార్పిడి, పక్షవాతం వంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న ఉపాధ్యాయులకు మినహాయించాల్సిందిగా కోరారు. గర్భిణీస్త్రీలు, పాలిచ్చు తల్లులు, 40 శాతంపైన వికలాంగత్వం ఉన్న ఉపాధ్యాయులను మినహాయించవలసినదిగా కోరారు. విదేశాలు వెళ్లటానికి ఎన్‌వోసి తీసుకుని ప్రయాణ టికెట్లు కలిగిన ఉపాధ్యాయులను మినహాయించాల్సిందిగా కోరారు. ఇప్పటికే మెడికల్ లీవ్‌లో ఉండి చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులను మినహాయించాల్సిందిగా కోరారు. 60 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. ఎన్నికల శిక్షణ తరగతుల కంటే ముందుగానే మెడికల్ బోర్డును ఏర్పాటుచేసి అవసరమైన ఉపాధ్యాయులకు విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎ.సుందరయ్య, కార్యవర్గ సభ్యులు వి.రాధిక, కె.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అనిత, ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు ఎ.సుందర్ రామారావు, నయిమ్ మహ్మద్, కె. శ్రీనివాసరావె, పి.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ చైతన్య కరదీపిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ప్రజాస్వామ్యంలో ఓటే మూలమని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వరావు అన్నారు. బుధవారం ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జై భారత్ సంస్థ రూపొందించిన ఓటర్ చైతన్య కరదీపికను ఆయన ఆవిష్కరించారు. ఆర్వో వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పోలింగ్ శాతం పెరుగుదలకు పలు సూచనలు చేశారు. స్వీప్ ప్రోగ్రాం ద్వారా నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటును అమ్ముకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఆఫీసర్ జివి శేషగిరి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.మల్లేశ్వరరావు, మండల రెవెన్యూ ఆఫీసర్స్ కె.సూర్యారావు, వత్సవాయి వి.అమ్మాజీ, పెనుగంచిప్రోలు మండల అధికారులు, నిఘా వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్రరావు కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశం నందు సెక్టార్ అధికారులు వారి పరిధిలో గల పోలింగ్ స్టేషన్స్‌కు వెళ్లేందుకు రూట్స్, పోలింగ్ స్టేషన్లు నందు మౌలిక సదుపాయాలను చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల నందు ఎన్నికల రోజు కావాల్సిన ఏర్పాట్లను చూడాలని, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏప్రిల్ 14న కళాశాల నందు లకు జరుగు శిక్షణ తరగతులకు సెక్టార్ అధికారులు కూడా హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశం లో నందిగామ నియోజకవర్గ సెక్టార్ అధికారులు, నందిగామ నియోజక వర్గ తహాశీల్దార్లు పాల్గొన్నారు.



ఇబ్రహీపట్నంలో పడిగాపులు కాస్తున్న వృద్ధులు





కంచికచర్లలో టెంట్ కింద కూర్చున్న వృద్ధులు, వికలాంగులు, పింఛను లబ్ధిదారులు (ఇన్‌సెర్ట్‌లో) నడవలేని వృద్ధురాలిని పింఛను తీసుకునేందుకు తీసుకొస్తున్న తోటి పింఛనుదారులు



నందిగామలో

ప్రజాశక్తి - విజయవాడ : పింఛన్లు అందక సదరు లబ్ధిదారులయిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు అనేక మంది పడిగాపులు కాచినా కానీ ఫలితం లేకుండా పోయింది. అరకొరగా పింఛన్ తీసుకున్న వారు సైతం బుధవారం సాయంత్రం వరకు వేచి ఉండక తప్పలేదు. అయినా పింఛన్ చేతికి అందక ఆయా సెంటర్లలో అవ్వా...తాతలు నీరశించి పోయారు. పింఛన్ కోసం షుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు పింఛన్ దారులపై తీవ్రమైన ప్రభావం చూపాయి. 3వ తేదీ గడిచినా కానీ పింఛన్ల పంపిణీ కేంద్రాలకు పూర్తి స్థాయిలో బ్యాంక్‌ల నుంచి డబ్బు విడుదల కాని పరిస్థితి విజయవాడ నగరంలో నెలకొన్నది. విజయవాడ నగర వ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 69 వేల వివిధ సామాజిక పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఒక్క సర్కిల్-2 పరిధి (సెంట్రల్ నియోజకవర్గం)లో 25 వేల పై చిలుకు పింఛన్లు పంపిణీ చేయాలి. ఇదే రీతిలో సర్కిల్-1, సర్కిల్-3 పరిధిలో కూడా ఇదే స్థాయిలో పింఛన్లు పంపిణీ జరగాల్సి ఉంది. బుధవారం రాత్రి 8 గంటల వరకు కూడా బ్యాంక్‌ల నుంచి పూర్తి స్థాయిలో డబ్బులు విడుదల కాలేదని నగరపాలక సంస్థ యుసిడి విభాగం అధికారులు వ్యక్తం చేశారు. 80 నుంచి 90 శాతం లోపు మాత్రమే డబ్బులు విడుదలయినట్లు వారు తెలిపారు. అయితే ఈ విడుదలయిన డబ్బును కూడా సచివాలయాల వారీగా సర్దుబాటు చేసి, పింఛన్ దారులకు పంపిణీ చేయడానికి రాత్రి 9 గంటల వరకు కూడా ఒక కొలిక్కి రాలేదని పింఛన్ దారులు చెబుతున్నారు. సాయంత్రం 4 గంటల తరువాత నుంచి ప్రారంభమైన ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాత్రి వరకు కొనసాగినా పూర్తి స్థాయిలో జరగలేదు. **ఇబ్రహీంపట్నం :** పెన్షన్ దారులు ఉదయం నుంచి సచివాలయాల వద్ద పడిగపులు పడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పెన్షన్ దారులకు సచివాలయాల వద్ద అధికారులు టెంట్లు వేయించి, మంచినీటి సదుపాయాలు కల్పించడంతో పెన్షన్ దారులు కొంత ఊరట చెందారు. మధ్యాహ్నం నుంచి వివిధ సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. కొంత మేరకు మాత్రమే పంపిణీ జరగడంతో మిగతావారు నిరాశగా వెనుదిరిగారు. కొండపల్లి మున్సిపాలిటీలో సుమారుగా 5346 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 1627 పింఛన్లు రూ.50 లక్షలు రాత్రి వరకు పంపిణీ చేశారు. మిగిలినవి గురువారం రాత్రికి పూర్తిచేస్తామని తెలిపారు. 9 సచివాలయాల పరిధిలో ఆరుగురు ఉద్యోగుల చేత పంపిణీ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. **నందిగామ :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్, నందిగామ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ అయిన ఆర్‌డిఒ ఆదేశాల మేరకు నందిగామ పురపాలక సంఘ అన్ని సచివాలయల పరిధిలో పెన్షన్ పంపిణి కార్యక్రమంలో నందిగామ మునిసిపల్ కమిషనర్ కె.హేమమాలిని పెన్షన్ పంపిణీ చేయు విధానాన్ని బుధవారం పరిశీలించారు. పట్టణంలో బయటకు రాలేని పెన్షన్ దారులకు కమిషనర్ స్వయముగా వారి ఇళ్ళ వద్దకు వెళ్లి పెన్షన్ అందజేశారు. **పెనుగంచిప్రోలు :** సచివాలయంల వద్ద సరైన సదుపాయాలు లేకపోవడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక లబ్ధిదారులు నీరసించిపోయారు. తాగునీరు, కూర్చునేందుకు కూడా కుర్చీలు బల్లలు ఏర్పాటు చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం వరకు కూడా నిధులు అందించలేదని ఫించన్లు పంపిణీ చెయ్యలేదు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలు నుంచి పంపిణీ ప్రారంభించారు. దూరం నుంచి వచ్చిన పలువురు పింఛన్ దారులు ఇంటికి వెళ్ళలేక భోజనాలు చెయ్యకుండానే అక్కడే పడిగాపులు కాస్తున్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలంలో సామాజిక పెన్షన్ల కోసం లబ్దిదారులు బుధవారం ఉదయం నుండి పడిగాపులు కాశారు. గొట్టుముక్కల గ్రామంలో బుధవారం సాయంత్రం మూడు గంటలకు ఆసరా పింఛన్లు పంపిణీ ప్రారంభించి ఐదు గంటలకల్లా సిబ్బంది డబ్బులు లేవని పింఛన్ పంపిణీ నిలిపివేశారు. ప్రభుత్వం ప్రతినెలా మొదటి తారీకున ఇవ్వాల్సిన ఆసరా పింఛను మూడో తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అయితే గొట్టుముక్కలలో మాత్రం సాయంత్రం మూడు గంటలకు మాత్రమే పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం 5:30 నిమిషాల నుండి వృద్ధులు వికలాంగులు వితంతువులు పింఛన్ కోసం గ్రామ సచివాలయం దగ్గర పడిగాపులు పడ్డారు. అయితే సిబ్బంది మాత్రం 200 మందికి సరిపడ నగదు మాత్రమే తీసుకువచ్చి రెండు గంటలు పంపిణీ చేసి నగదు లేదని లబ్ధిదారులను తిప్పి పంపి వేశారు. ప్రభుత్వం ప్రకటించిన దానికి ఆచరణలో గ్రామస్థాయిలో జరుగుతున్న దానికి ఎటువంటి పొంతన ఉండటం లేదు సత్వరమే తమకు పింఛన్ అందజేయాలని పింఛనుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగింది.

నందిగామలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : పట్టణంలో 12 వార్డులో వైసిపి శ్రేణులతో కలిసి ప్రతి గడపకు తిరుగుతూ, ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ జగనన్న పాలనలోఎమ్మెల్యేగా తన ఐదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని తెలిపారు. ముఖ్యంగా గత నందిగామను - ప్రస్తుత నందిగామను పోల్చుకుంటే ఎంత అభివద్ధి జరిగిందో స్పష్టంగా కనబడుతుందన్నారు.నందిగామకు రెవిన్యూ డివిజన్ సాధించాం అన్నారు. పూర్తిగా నమ్మితేనే తనను ఆశీర్వదించండి అని కోరారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న జగన్మోహన్‌రావు

కళాకారులను ప్రోత్సహించాలి



ప్రచారంలో భాగంగా కళాకారుడిని కలిసిన మధు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని తొర్రగుంటపాలెంలో జైభీమ్ రావ్‌భారత్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి మధు బుధవారం ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక కళాకారుడు తారసపడినప్పుడు అతనితో మాట్లాడారు. కళాకారుల జీవనవిధానం, పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నేటికీ వారి జీవన విధానంలో మార్పు లేదని, ప్రభుత్వం వీరిని చిన్న చూపే చూస్తుందని అన్నారు. 'జై భీమ్ రావ్ భారత్ పార్టీ' అధికారంలోకి వస్తే ఇలాంటి సమస్యలను అధిగమించి, ఎక్కువ పనులు చేయడానికి తమకు శక్తి సామర్థ్యాలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ తమ 'కోటు' గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం, మైలవరం పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎసిపి ఎస్.మురళీకృష్ణ, సిఐ కిషోర్ బాబు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జీవితాలను చిత్తు చేస్తుందని, విద్యార్థులు తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటారన్నారు. యువత ఆన్లైన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, ఎటువంటి సెక్యూరిటీ లేని యాప్స్‌ని మొబైల్‌లో ఉపయోగిస్తూ ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శివ హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
గురువారం 4 ఏప్రిల్ 2024

ఇద్దరు పింఛనుదారుల మృతి

- చల్లపల్లిలో స్పృహ కోల్పోయిన వృద్ధుడు
- పింఛన్ల కోసం పడిగాపులు



ఉయ్యూరులో పింఛను కోసం సచివాలయానికి వచ్చిన వృద్ధులు



మోపిదేవిలో పింఛను కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి : పింఛను అందుకునేందుకు వచ్చిన ఇరువురు వృద్ధ మహిళలు వడదెబ్బకు తాళలేక మృతి చెందారు. వివరాల ప్రకారం పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన వెంపటి వజ్రమ్మ (80), పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన పిల్లి నాగేశ్వరమ్మ (77)లు పింఛను అందుకునేందుకు వచ్చి వడదెబ్బకు గురై మృతి చెందారు.

పింఛన్ల పంపిణీపై పెనమలూరులో రాజకీయ దుమారం

గంగూరులో మృతి చెందిన వజ్రమ్మ మృతదేహాన్ని మంత్రి జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యే టిడిపి పెనమలూరు అభ్యర్థి బోడే ప్రసాద్, జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి , ఎంపి వల్లభనేని బాలశౌరిలు బుధవారం సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వజ్రమ్మ కుటుంబమ సభ్యులను పరామర్శిస్తున్న సమయంలోనే జోగి రమేష్ అక్కడకు వచ్చారు. ఈ సయమంలో అధికార వైకాపా, ప్రతిపక్ష టిడిపి కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇంటి వద్ద పింఛన్లు అందించకుండా ప్రతిపక్ష నేత చంద్రబాబు కోర్టుకు వెళ్లి అడ్డుకోవడంతోనే వజ్రమ్మ మృతి చెందిందని జోగి రమేష్‌తోపాటు, వైకాపా కార్యకర్తలు ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో నగదు జమచేయకపోవడంతో పింఛనర్లు ఒకటికి రెండు సార్లు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని బోడే ప్రసాద్ ఆరోపించారు. సాయంత్రం కుటుంబాన్ని పరామర్శించిన ఎంపి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీపై శ్రద్ధ పెట్టకపోవడంతోనే వృద్దులు అవస్థలు పడాల్సి వస్తోందని ఆరోపించారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** పెన్షన్‌కి వెళుతూ ఓ వృద్ధుడు దారిలో స్పృహ తప్పి పడిపోయిన సంఘటన చల్లపల్లి మండలంలో జరిగింది. చల్లపల్లిలోని మూడవ సచివాలయ పరిధి లోని ఎస్టీ కాలనీకి చెందిన పొన్న సుబ్బారావు బుధవారం ఉదయం పెన్షన్ కు వెళుతూ స్పృహ కోల్పోయి రోడ్డు పక్కన పడిపోయాడు. స్థానికులు గమనించి 108కి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది మెరుగైన వైద్యం కోసం చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** సామాజిక భద్రత పింఛన్లు కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుండి వద్ధులు, వికలాంగులు, వితంతువులు పడిగాపులు కాశారు. మూడో తేదీన ఇస్తారనడంతో ఉదయం నుండి ఒక్కొక్కరుగా గ్రామ సచివాలయల వద్దకు చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు విధులకు వచ్చిన పంచాయతీ ఉద్యోగులు , గ్రామ సచివాలయం ఉద్యోగులు డబ్బులు ఇంకా విడుదల చేయలేదు... సాయంత్రానికి వస్తే కబురు చేస్తామని సెలవివ్వటంతో నిరాశతో వెనుతిరిగారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు నగరపంచాయతీ, మండల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభించారు. నగరపంచాయతీ పరిధిలో 3,994 మంది పింఛను తీసుకునేవారి కిగాను రూ. ఒక కోటి19 లక్షల, 53 వేలు పంపిణీ చేయవలసి ఉండగా 10 వార్డు సచివాలయాల్లో పంపిణీ ప్రారంభిం చారు. వికాలాంగులు, 80 సంవత్సరాల వద్ధులకు గురువారం ఇంటివద్దకు వెళ్లి పింఛను ఇస్తామని చెప్పినప్పటికి తీసుకునేందుకు సచివాలయాలకు వచ్చారు. మండల పరిధిలో పదకొండు గ్రామాలకు గాను పెదఓగిరాల, ఆ కు నూరు రెండు గ్రామాల్లో మాత్రమే పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. బ్యాంకుఖాతాలో సరిపడంత డబ్బు పడకపోవడంతో మిగిలిన గ్రామాల్లో పంపిణీ చేయలేక పోయామని గురువారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో జి లక్ష్మీదేవి తెలిపారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండల పరిధిలోని 11 సచివాలయలలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ చేశారు. వద్ధులు, వికలాంగులు, మధ్యాహ్నం నుంచి పెన్షన్ కోసం సచివాలయల దగ్గరకు వచ్చి సమయం నాలుగు ఎప్పుడవుతుందా పెన్షన్ ఎప్పుడు ఇస్తారు అని ఎదురు చూశారు. సర్వర్లు కూడా ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా నాలుగు తర్వాత వెంట వెంటనే పెన్షన్ ఇవ్వడంతో పెన్షన్‌దారులు ఆనందంతో ఇళ్లకు వెళ్లారు. కొంతమంది వికలాంగులు మాత్రం అవస్థలు పడుతూ సచివాలయల దగ్గరకు వచ్చి పెన్షన్ తీసుకున్నారు.

కృష్ణాలో 44 శాతం పింఛన్ల పంపిణీ

కృష్ణాజిల్లాలో ఏప్రిల్ నెల పింఛన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొదలైంది. రాత్రి తొమ్మిది గంటల వరకు పింఛన్లు పంపిణీ జరిగింది. మొత్తం 2, 44, 264 మంది పింఛన్లు తీసుకోవాల్సి ఉండగా మొదటి రోజు 44 శాతం 1,08, 427 మంది పింఛన్లు అందుకున్నారు. రూ. 72 కోట్ల 01 లక్ష 45 వేలు పంపిణీ చేయాల్సి ఉండగా రూ. 32 కోట్ల 71 లక్షల 64 వేలు నగదు పంపిణీ అయింది.



చోరీ జరిగిన తరగతి గదిని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, ఎస్సై

కానుమోలు హైస్కూల్లో చోరీ

ప్రజాశక్తి-హను మాన్‌జంక్షన్: బాపు లపాడు మండలం కాను మోలు హైస్కూల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలి యని వ్యక్తులు చొరబడి విలువైన వస్తు వులను దొంగ తనం చేసిన విష యంపై హెచ్ఎం పద్మజ బుధవారం హనుమాన్ జంక్షన్ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, హనుమాన్జంక్షన్ ఎస్సై జనార్ధన్తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హెచ్ఎం పద్మజ తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థులకు దశ్యశ్రవణ విధానం ద్వారా బోధించేందుకు ప్రభుత్వం అందజేసిన రూ1 లక్ష విలువైన 2 ఐఎస్బీ ప్యానల్ బోర్డులు చోరీకి గురైనట్లు వివరించారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన తీరుపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన సంఘటన కోడూరుపాడులో చోటుచేసుకుంది. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన చింతపల్లి లక్ష్మి మహిళకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. చింతపల్లి లక్ష్మి తన తల్లితో కలిసి తాటాకు ఇంటిలో నివశిస్తూ దినసరి వేతన కూలీగా జీవనం సాగిస్తోంది. విద్యుత్ సర్క్యూట్ వల్ల ఇంటిలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయని ఇంట్లోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైనట్లు ఆమె వాపోయింది. స్థానికుల సమాచారంతో హనుమాన్జంక్షన్ అగ్నిమాపక అధికారి రామ్మోహనరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. దాచుకున్న నగదు, బంగారం కూడా మంటల్లో కాలిబూడిదయ్యాయ మని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3లక్షలకు పైగా ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేసినట్లు అగ్నిమాపక అధికారి రామ్మోహనరావు తెలిపారు.

బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం శారదాయిపేట గ్రామానికి చెందిన బుక్ కీపర్ వీరవల్లి భారతి నారీకేడ్లవానిపాలెం గ్రామానికి చెందిన విఓ వాట్సఅప్ గ్రూప్లో వద్ధులు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వపోవడానికి కారణం ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడమేనని పోస్ట్ చేసిందని కావున ఆమెపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండల ఏపిఎం రాజగోవింధ్‌కు ఆయన కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు బుధవారం ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల అధ్యక్షులు పోతన స్వామి, దాసరి ఉమా సాయిరాం, కొలపల్లి రజిని, శారదాయపేట పార్టీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నున్నలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర అభివద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం రావాలని గన్నవరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని ఎస్సీ కాలనీలో సతీష్, లక్ష్మీ దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం లో కలకోటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెక్ పోస్ట్ పరిశీలిస్తున్న
జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్‌పి

చెక్‌పోస్ట్‌ల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని పోలీస్ చెక్‌పోస్టును బుధవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాల్‌నయీం, ఇతర అధికారులు పరిశీలించారు. ప్రతి వాహనాన్ని పరిశీలించి డబ్బు, బంగారం వంటివి రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల్లో తనిఖీ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని 48వ డివిజన్ నిజాంపేట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఆనుమకొండ రామకష్ణ బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోనికి చేరారు. ఆయనతో పాటు తెలుగుదేశం నాయకులు అనుమకొండ బాబు, పొన్నూరు సత్యం, కూతాడి సుబ్బరాజు తదితర 20 కుటుంబాలకు చెందిన టిడిపి నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన ప్రతిఒక్కరికి మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని),మచిలీపట్నం నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి పేర్ని క్రిష్ణమూర్తి (కిట్టు ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనికి ఆహ్వానించారు.

పింఛన్లపై రాజకీయం సిగ్గుచేటు

ప్రజాశక్తి-గుడివాడ : వృద్ధులు, వికలాం గులు, వితంతువులు, నెలనెలా ఇచ్చే పింఛన్లను రాజకీయం చేయడం సిగ్గుచేటని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి విమర్శించారు. బుధవారం సిపిఎం కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు పింఛన్‌ని రాజకీయానికి వాడుకోవటం సిగ్గుచేటన్నారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-కోడూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడూరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కేంద్ర పోలీసు బలగాలతో కలసి అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడవద్దని ప్రజలను హెచ్చరిస్తూ మరో పక్క మేమున్నాం అంటూ భరోసా ఇచ్చారు. పోటుమీద, పెద్దగుడుమోటు, మందపాకల, జరుగువానిపాలెం, ఐబి పేట, మెరక గౌడ పాలెం, కోడూరు ఎస్సీ కాలనీ కోడూరు ప్రధాన సెంటర్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అవనిగడ్డ డిఎస్పీ పి.మురళీధర్, అవనిగడ్డ సీఐ లు పివి త్రినాథ్,, కోడూరు ఎస్సై పి శిరీష నాగాలంక అవనిగడ్డ ఎస్సైలు ,ఏఎస్ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పోతేపల్లిలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి జ్యువలరీ పార్కులో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ 6 పథకాలను వ్యాపారస్తులకు, కార్మికులకు తెదేపా, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర, కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛనుదారులను ఇబ్బందులకు గురిచేయడం తగదు : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాజకీయ లబ్ధి కోసమే పెన్షన్ దారులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని అవనిగడ్డ టిడిపి నాయకులు ఆరోపించారు. బుధ వారం అవనిగడ్డ సచివాలయం వద్ద మాట్లాడుతూ సామాజిక పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న వారిని కలిసి కేంద్ర ఎన్నికల సంఘం పెన్షన్ల పంపిణీలో వాలంటీర్లను వాడవద్దని మాత్ర మే చెప్పిందని అన్నారు.నాయకులు బండే రాఘవ, మాచవరపు ఆదినారాయణ, బొచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, మండలి రామ్మోహన్రావు, షేక్ బాబావాలి పాల్గొన్నారు..

కాంగ్రెస్ మోసం చేసింది : మాజీ కౌన్సిలర్ శొంఠి

ప్రజాశక్తి-గుడివాడ : 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన తనకు గతంలో అలాగే ఇప్పుడు కూడ గుడివాడ ఎమ్మెల్యే సీటు ఇస్తానని మోసం చేసిందని కాంగ్రెస్‌పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ శొంఠి దామోదరరావు(బుజ్జి) ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వలివర్తిపాడు రోడ్డులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు తేలు సత్యనారాయణతో కలసి ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కఠారి సత్యనారయణరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావుల హయాం నుండి వారి అనుచరుడిగా, మాజీ కౌన్సిలర్‌గా కాంగెస పార్టీకి ఎనలేని సేవలు చేసిన తనకు 2019లో సీటు ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. తన శ్రేయోభిలాషులు, అభిమానులు తనను కలసి పార్టీకి రాజీనామా చేయాలని, స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేయాలని కోరడంతో తన నిర్ణయాన్ని ఉగాది పండుగా అనంతరం ప్రకటిస్తానని శొంఠి తెలిపారు.

పంటల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరులపాడు : నూజివీడు కంపెనీ విత్తనాలు వాడి మోసపోయిన రైతుల పంట పొలాలను మండల వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు జుజ్జూరు గ్రామంలోని పంటలను బుధవారం పరిశీలించారు. 'నకిలీ విత్తనాలతో తిప్పలు' అనే శీర్షికన ప్రజాశక్తిలో మార్చి 27న ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. నూజివీడు వారి విత్తన కంపెనీ వారి సమక్షంలో రైతులు చాలు చేసిన పంట పొలాలను పరిశీలించారు. జుజ్జూరు నూజివీడు వారు పంపిణీ చేసిన విత్తనాలు సరైన దిగుబడి రాలేదని విత్తన కంపెనీ వారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతుల అందించిన ఫిర్యాదు మేరకు మండల వ్యవసాయ శాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంట పరిస్థితి వివరాలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు సాగుచేసిన విస్తరణలో మూడు భాగాలు పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపి రైతులను ఆదుకుంటామని వారు తెలిపారు. శాస్త్రవేత్తలు మొక్కజొన్న నమూనాను తీసుకొని పరిశోధన నిర్వహించి పరిశోధనలో వచ్చిన ఆధారాన్ని పెట్టి ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. పరిశీలనలో గుంటూరు వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వై.ప్రసాదు, కామాక్షి, మండల వ్యవసాయ అధికారి జోగేంద్ర ప్రసాదు, విలేజ్ వ్యవసాయ అధికారులు ఆర్ఎంఎస్‌కె చారి ఎం.నాగరాజు, ఎం.గోపి భూలక్ష్మి, రైతులు వెంకటేశ్వరరావు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు


ప్రచారంలో సౌమ్య, నెట్టెం రఘురాం

సౌమ్య ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో ఒకటో వార్డులలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి తంగిరాల సౌమ్య జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి విజయవాడ పార్లమెంట్ అధ్యక్షులు నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురాం, సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పట్టణంలో వైసిపి పాలనలో అవినీతి తప్ప మరేం అభివద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక బిసి కాలనీలో ఇటీవల మృతి చెందిన కాళంగి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎన్నారై వల్లభనేని గిరి రాయల సుబ్బారావు అరిగే శ్రీనివాసరావు ఈ సాయం అందజేశారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని మల్కాపురం గ్రామంలో బుధవారం రాత్రి అన్ని రాజకీయ పార్టీ నాయకులతో చిల్లకల్లు ఎస్ఐ సతీష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు అందరూ సహకరించాలని కోరారు.

మజ్జిగ, తాగునీరు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : పెంట్యాలవారి గూడెంలో కోదండ రామాలయం, దాసాంజనేయ స్వామి, అమ్మవార్ల దేవాలయాల ప్రతిష్ట నిర్వహించారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కన్సల్టింగ్ ఆరుద్ర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో యాత్రికులు పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మహాలక్ష్మిని దర్శించుకున్న సిన్హా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆంధ్రరాష్ట్ర పోలీస్ డిజిపి రోడ్డు సేఫ్టీ అథారిటీ అంజనా సిన్హా కుటుంబ సభ్యులతో కలిసి చిట్టినగర్‌లో వేం చేసి యున్న మహాలక్ష్మి అ మ్మవార్ల (కొత్త అమ్మవారు) మరియు శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్లను బుధవారం దర్శించి అయ్యావార్ల, అమ్మవార్ల ఆశీస్సులు అందుకని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, సెక్రటరీ మరుపిల్ల హనుమంతరావు, కోశాధికారి పిల్ల శ్రీనివాసరావు, పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించిరి పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాంపిళ్ళ శ్రీనివాసరావు, రాయన గురునాథరావు, గూడేల రామకృష్ణ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతిన మహేష్

భవిష్యత్ కార్యాచరణపై సమావేశం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేన పార్టీ పశ్చిమ నియోజక వర్గ కార్యాల యానికి విచ్చేసిన నాయ కులు, కార్యకర్తలతో పశ్చిమ ఇన్‌ఛార్జి, నగర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ భవిష్యత్ కార్యా చరణపై బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో చర్చించారు. జనసేన జెండా కోసం జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాస్ కోసం పశ్చిమ సీట్‌ను పోతిన మహేష్‌కు కేటాయించాలని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించినందుకు ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు వల్ల ఎటువంటి భయం వద్దని కచ్చితంగా అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. వీరిలో ప్రధానంగా బైపు రామకృష్ణ, ప్రశాంత్, మహేష్, సాయి, జగదీష్, గాంధీ తదితరులున్నారు.

పాలశీతల కేంద్రం ప్రారంభం

తిరువూరు : తిరువూరు పాలశీతల కేంద్రం క్లస్టర్ పరిధిలోని గంపలగూడెం మండలం గుళ్ళపూడి పాల కేంద్రంలో అధు నాతనమైన మిల్క్ అనలైజర్ ను జనరల్ మేనేజర్ జి.అనిల్ కుమార్ బుధవారం రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా రూ.కృష్ణా మిల్క్ యూనియన్ సబ్సిడీపై అందించే సేమన్ ఉపయోగించుకుంటే నాణ్యమైన దూడలు పుడతాయని చెప్పారు. తడి పొడిగా క్యాల్షియం వాడు కోవడం వల్ల గేదెలు తొందరగా ఎదకు వస్తాయని, పాల ఉత్పత్తి అధికంగా పెరుగుతుందని, ఫ్యాట్ కూడా వస్తుందని అన్నారు. ప్రయివేట్ డైరీల కన్నా కృష్ణా మిల్క్ యూని యన్ రైతులు 10 శాతం ఫ్యాట్ కి రూ.80 రూపాయలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేజర్ సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షులు కేతినేని ప్రసాద్, సంఘ పాలక వర్గ సభ్యులు, సూపర్ వైజర్ పి.ప్రసాద్, పాడి రైతుల పాల్గొన్నారు.


పాలశీతల కేంద్రం ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్, తదితరులు

కుట్రతోనే పించన్ల పంపిణీపై ఫిర్యాదు : ఆసిఫ్

ప్రజాశక్తి - వన్ టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లకు వృద్ధులు, దివ్యాంగుల ఉసురు కచ్చితంగా తగులుతుందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం జగనన్న ప్రభుత్వంపై కక్ష, వలంటీర్లు అంటే భయంతోనే కుట్రపన్ని తమ మనుషులతో ఈసీకి ఫిర్యాదు చేయించారని అన్నారు. అసిఫ్ బుధవారం 55వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తాము ఏ ఇంటికి వెళ్లిన వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమకు పింఛను వస్తుందా... రాదా.. అని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో సుజనా చౌదరి వంటి పగటి వేషగాళ్లు డబ్బు మూటలతో వస్తుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిరంతరం ప్రజలకు తనవంతు సేవలు అందిస్తున్నానని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆసిఫ్ కోరారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.


ప్రచారంలో ఆసిఫ్

పశ్చిమలో కోటేశ్వరరావు ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దేశంలో మతోన్మాద పాలన సాగిస్తున్న ప్రధాని మోదీ ప్రతినిధిగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థిని, రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సిఎం జగన్ పార్టీ తరపున బరిలో ఉన్న వైసిపి అభ్యర్థిని ఓడించాలని సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిత్యం ప్రజలు, కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్న ఇండియా కూటమి బలపరిచిన సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సీపీఐ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఎం బలపరిచిన ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు విద్యార్థి నాయకుడిగా, కార్మిక నాయకుడిగా, కార్పొరేటర్‌గా పశ్చిమ ప్రజలకు సుపరిచితులని, పక్షాన శాసన సభలో ప్రజల గొంతుకను వినిపించేందుకు ఆయనను గెలిపించాలన్నారు. జి.కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వస్త్రలత క్లాత్ ముఠా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు, పెద్ద మేస్త్రీ చీపిళ్ల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసీ నగర కార్యవర్గ సభ్యులు మూలి సాంబశివరావు, నగర అధ్యక్షుడు కేఆర్. ఆంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య, ప్రజా నాట్యమండలి కోశాధికారి ఆర్.పిచ్చయ్య, బీసెంట్ రోడ్డు క్లాత్ ముఠా కార్యదర్శి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వరరావు


పాలిసెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యార్థులకు ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పందన లభిస్తుందన్నారు. బుధవారం విజయవాడ, ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ తో సహా, పలు ఎంట్రన్స్ కోచింగ్ కేంద్రాలను నాగరాణి సందర్శించి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేసారు. పాలిటెక్నిక్ ప్రవేశాలను కోరుకునే ప్రతి ఒక్కరికీ వయోబేధం లేకుండా శిక్షణ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్స్‌లలో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహించి ఏప్రిల్ 25వ తేదీన గ్రాండ్ ప్రీ ఫైనల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ను సైతం నిర్వహిస్తామని నాగరాణి వివరించారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు ఉపకరించేలా రెండు భాషలలోనూ స్టడీ మెటీరియల్ సిద్ధం చేసామన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఈ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఎనిమిదవ తేదీ నుండి మరో బ్యాచ్ ప్రారంభించేందుకు సాంకేతిక విద్యా శాఖ సన్నాహాలు చేస్తుందన్నారు. పాలిసెట్ కోచింగ్ స్టడీ మెటీరియల్‌ను ప్రతి ఒక్క విద్యార్థికి అందిస్తామని, రెండు గంటల పాటు గణితం, ఒక గంట భౌతిక శాస్త్రం, మరో గంట రసాయన శాస్త్రం బోధిస్తారన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షా ఏప్రిల్ 27వ తేదీన కాగా, ఆన్‌లైన్ అప్లికేషన్‌లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని నాగరాణి స్పష్టం చేసారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొని, పాలిటెక్నిక్ తరువాత లభించే ఉపాధి అవకాశాల గురించి స్వయంగా కమిషనర్ తో వ్యక్తిగతంగా మాట్లాడి సందేహాలను నివత్తి చేసుకున్నారు. సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామ్, ఉప కార్యదర్శి రవికుమార్, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగరాణి

ఎంత ఎదిగినా ఒదిగిన దాసరి నవభారతి

● అభినందన సభలో వక్తలు





నవభారతిని సత్కరిస్తున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు, పిల్లలు

ప్రజాశక్తి-గన్నవరం : జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగిన వారికే ప్రజలలో, సంఘంలో గుర్తింపు వస్తుందని, అలాంటి గుర్తింపు పొందిన వారిలో దాసరి నవభారతి ఒకరని చెప్పడంలో అతిశయోక్తి లేదని పలువురు వక్తలు కొని యాడారు. బుధవారం గన్నవరం మండల కేంద్రంలోని చింతలపేట ఎంపీపీ పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్ హెచ్.ఎం, యుటిఎఫ్ నాయకురాలు దాసరి నవభారతి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రెసిడెంట్ నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే. లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి మరీదు వరప్రసాద్, మాజీ ఎంఈఓ జయబాబు, గన్నవరం ఎంఈఓ-1 రవి, ఎంఈఓ- 2 కమల, మండలం ప్రధాన కార్యదర్శి జి. రాజాబాబు, అధ్యక్షులు గొట్టం రవిబాబు, బాలోత్సవం నాయకులు గన్నె వెంకట్రావు, కర్రా వరప్రసాద్, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు వై నరసింహారావు, ఆర్.రఘు, కే. వెంకటేశ్వరరావు, టీవీ.లక్ష్మణస్వామి, మల్లంపల్లి ఆంజనేయులు, మల్లంపల్లి జయమ్మ, అనుమోలు వెంకటేశ్వరరావు, సామాజిక వేత్త డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు,పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు నవ భారతికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మెమొంటోతో సత్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, అక్షరాలు అందరికీ అందాలని తపించి, పాఠశాలలను పవిత్రంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసిన నవ భారతికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. 40 ఏళ్ల పాటు దీర్ఘంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత నవ భారతికి దక్కుతుందని కొనియాడారు. ఉద్యోగ విరమణ తర్వాత రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై పని చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలు పరిష్కంచాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలతో ముచ్చటించి వారి బాధల సాధకాలు తెలుసుకున్నారు. బుధవారం ఐలూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో ఇంకా ఉపాధి హామీ పనులు ప్రారంభం కాలేదని ఈ రెండు గ్రామాల్లోని ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని కోరారు. నేటికీ గత సంవత్సరం బకాయిలు కొన్ని గ్రామాలో ఇంతవరకు ఇవ్వలేదని, వెంటనే నగదు అందించాలని కోరారు. మండలంలో 16 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వెంటనే మొదలు పెట్టాలని, ఉపాధి కూలీలకు మంచినీటి సౌకర్యం, టెంటు ఏర్పాటు చేయాలని కోరారు. సమ్మర్ అలవెన్స్, కనీస వేతనం 600 రూపాయలు, మంచినీళ్లకు డబ్బులు, 200 రోజులు పనిదినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శ్రీలం ప్రకాష్‌రావు, జుజ్జువరపు ఏసేపు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, తదితరులు

నేడు ఎస్ఆర్‌జిఈసి కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకలు గత నెలలో 16 నుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగిన విషయం విదితమే. 25 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 26 వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఏప్రిల్ 4వ తేదీన కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు.ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్, ప్రొఫెసర్, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, నూజివీడు నుండి ఎం. చంద్రశేఖర్ పాల్గొననున్నట్లు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్స్ బహూకరణ, పి.హెచ్.డి. పట్టాలు పొందిన అధ్యాపకులకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి.కోదండ రామారావు, డా.ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డా. పి.రవీంద్ర బాబు, కన్వీనర్ డాక్టర్ సి.హెచ్ సురేష్ బాబు ,ప్రొఫెసర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, కో కన్వీనర్ డాక్టర్ ఏ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన పోరాడే వారిని ఆదరించాలి

● సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు



సూరంపల్లి లో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : కార్మికుల పక్షాన పోరాటం చేసే వారికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరుతూ మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లా డుతూ.. దేశంలో ఈసారి బీజేపీ 210 సీట్లు దాటడం గగనమే అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో మోదీ నిర్దేశించుకున్న 370 సీట్ల లక్ష్యం చేరుకోవడం ఎంత అసాధ్యమో, బీజేపీ 200 సీట్లు దాటడం ఎంత గగనమో రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళలో సీట్లు పొందే అవకాశం లేదన్నారు. దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో దక్షిణాదికి చెందిన 128 స్థానాలు పోగా మిగిలిన 415 స్థానాలలో ఎన్డీఏ కూటమి రమారమి 385 స్థానాలు సాధించాలని లేదా బీజేపీ 355 స్థానాలు సాధించాలన్నారు. నార్త్ ఇండియాలో బీజేపీ పోటీ చేసే అన్ని సీట్లు గెలిస్తే గాని 370 సీట్లు సాధించలేదన్నారు. ఇది ప్రజలతో, ప్రతిపక్షాలతో మైండ్‌గేమ్ తప్ప ఇంకొకటి కాదన్నారు. దీనిని అర్థం చేసుకోలేనంత అమాయకులు ప్రజలు కాదన్నారు. బిజెపితో కలిసి మైండ్ గేమ్ ఆడుతున్న వైసిపికి, దోస్తీ కట్టి ముందుకు వెళుతున్న టిడిపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ రఘు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఈ పది సంవత్సరాల కాలంలోనే ఒక కోటి పది లక్షల కోట్ల అప్పులు చేసి, ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అప్పులపై విమర్శలు చేయడం మోడీకే చెల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు,పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది.

టిడ్కో రుణాలు మాఫీ చేయాలని ప్రదర్శన



మాట్లాడుతున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో గహాల బ్యాంక్ రుణాలు రూ. 650 కోట్లు ఎన్నికల ముందే మాఫి చేస్తా మని రాజ కీయ పార్టీలు హామీ ఇవ్వాలని టిడ్కో కాలనీ అభి వృద్ధి కమిటీ కార్య దర్శి బసవ అరుణ అన్నారు. బుధవారం టిడ్కో కాలనీలో సి1 బ్లాక్ నుండి సి26 బ్లాక్ వరకు 100 మంది లబ్దిదారులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బసవ అరుణ మాట్లాడుతూ ఎన్నికలలోపే రుణమాఫీకి స్పష్టమైన హామీ ఇవ్వాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో వైసిపి, టిడిపి చేర్చాలని, కాలనీలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని, అభివద్ధి కమిటీ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సంగమ్మ, ఉపద్యక్షురాలు ఎమ్.దుర్గ, కమిటీ సభ్యులు మాధవి, జానకి ,రాజేశ్వరి, ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయలో ఏకాంక్షత్‌కు సీటు



ప్రజాశక్తి-ఘంటసాల : జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఘంటసాల క్రిస్టియన్ పేటకు చెందిన విద్యార్థి కొడాలి ఏకాంక్షత్ 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు. గత జనవరిలో జవహర్ నవోదయ విద్యా సమితి ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఏకాంక్షత్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం సాధించడం పట్ల దళితవాడలో శ్రమజీవులైన విద్యార్థి తల్లిదండ్రులు కొడాలి నరేష్ బాబు - భానుశ్రీ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్రిస్టియన్ పేట నుంచి నవోదయలో సీటు సాధించిన ఏకాంక్షత్ ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు

గడపగడపకూ వంశీ ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గం పరిధిలోని ఎనికెపాడు గ్రామంలో బుధవారం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ గడపగడపకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించడంతో పాటు ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేశారు. యువకులు ఆయనపై పూలు జల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ నాయకులు గజమాలవేసి సత్కరించారు. ప్రజాభిమానం పొందిన నాయకుడు వంశీ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మకోట్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వంశీకి గజమాల వేస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ రహితంగా కెయు

● ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ విభాగం పని చేయాలని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పిలుపునిచ్చారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యములో నిర్వహించిన షాహిద్ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా వుంచడానికి ప్రణాళిక బద్దంగా కృషి చేయాలని కోరారు. చేసే పనిలో నిబద్ధత వున్నప్పుడే లక్ష్యాన్ని సాధించవచ్చు అని పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం సముద్ర తీర ప్రాంతంలో వున్నందున మత్స్యకార మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్‌బాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 750 విశ్వవిద్యాలయాలు వుంటే కేవలం 10 విశ్వవిద్యాలయాలలో మాత్రమే షాహిద్ దీవస్ కార్యక్రమం నిర్వహించడానికి అవకాశం ఉందని, అందులో కృష్ణా విశ్వవిద్యాలయం ఒకటి కావడం గర్వకారణమన్నారు. మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఎన్ సి సి అధికారి డా రామశేఖర్ రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా స్వరూపా. డా రవి, డా శేషా రెడ్డి, డా శాంతి కపా, డా సుజయ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞా చేయించారు. తదుపరి నిర్వహించిన స్వచ్ క్యాంపస్ కార్యక్రమంలో ఉపకులపతి, రిజిస్ట్రార్‌లు పాల్గొని విద్యార్థులలో ఉత్సాహం నింపారు.

నేడు కాల్వలకు నీరు విడుదల

కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నేటి నుండి కాల్వలకు నీరు విడుదల చేస్తున్న దృష్ట్యా జిల్లాలో తాగునీటి చెరువులన్నీ నింపడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో తమ ఛాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితి, వేసవిలో ఎండ తీవ్రతకు తీసుకుంటున్న చర్యల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల వనరుల శాఖ ద్వారా ప్రకాశం బ్యారేజీ నుండి కాల్వలకు నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాల్వల ద్వారా వచ్చే నీటిని తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న శివారు ప్రాంతాలకు చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని, చేపల చెరువులకు, తాగునీటేతర అవసరాలకు మళ్లించకుండా చూడాలని అన్నారు. శివారు ప్రాంతాలైన కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో తాగునీటి చెరువులు నింపుటకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఇరిగేషన్ శాఖ షెడ్యూల్ ప్రకారం కాల్వలపై పహారా బృందాలు పర్యటించి, తాగునీటి మళ్లింపు అరికట్టాలన్నారు. తాగునీటి చెరువులు నింపే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



ఎం.పద్మావతికి సూచించారు. ఏప్రిల్, మే మాసాల్లో ఎండ తీవ్రత, వడగాల్పులు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, ఇరిగేషన్ ఎస్ఇ ప్రసాద్‌బాబు, డ్వామా పీడీ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ వెంకటరమణ, డిపిఓ నాగేశ్వరనాయక్, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పని వేళల మార్పు

ప్రజాశక్తి-విజయవాడ: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు



జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పని వేళలను మార్పు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలు ఈ నెల 4వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేస్తాయని, మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలను ఇంటికి పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు మే 1 నుంచి 15వ తేదీ వరకు, అంగన్వాడీ సహాయకులకు మే 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కాలంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు అంగన్వాడీల ద్వారా లబ్దిదారులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ పంపిణీలో అంతరాయం లేకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి : జెసి



ప్రజాశక్తి-విజయవాడ: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ. తప్పక పాటించాల్సిందేనని భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మార్గదర్శకాలను పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల నుండి తీసుకోవాల్సిన ముందస్తు అనుమతులపై బుధవారం జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల నిర్వహణ, లౌడ్ స్పీకర్లు, వాహనాల వంటి వాటికి సంబంధించి తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో వినియోగించే ప్రచార వాహనాలకు హెలిప్యాడ్, హెలికాప్టర్, ఎల్ఇడి, ఎయిర్ బెలూన్ వినియోగానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. ఒక నియోజకవర్గ పరిధిలో బహిరంగ సభలు, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు వాహనాలకు అనుమతి బహిరంగ సభలలో స్పీకర్లు బ్యారిగేట్స్ నిర్మాణంతో పాటు ఇంటింటి ప్రచారానికి, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుండి అనుమతులను తీసుకోవాలన్నారు. ఒకటికి పైగా నియోజకవర్గాలలో ప్రదర్శనలు, ర్యాలీలను నిర్వహించాల్సి వస్తే ఆయా రాజకీయ పార్టీలు పార్లమెంటరీ రిటర్నింగ్ ఎన్నికల అధికారి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు ముద్రించి పంపిణీ చేసేటప్పుడు ఆయా వాల్‌పోస్టర్లపై ముద్రణ సంస్థ పేరు, ముద్రించిన ప్రతుల సంఖ్యను ముద్రించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వి. శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, డీవీ కష్ణ (సీపీఎం), వై.రామయ్య (టీడీపీ), సోమశఖర్, జి. సురేష్ (ఐఎన్‌సీ), కె.పరమేశ్వరరావు (ఆప్),ఎల్ శివరామ్ ప్రసాద్ (వైఎస్ఆర్‌సీపీ), పివి శ్రీహరి (బీజేపీ), ఎం.వినోద్ కుమార్ (బీఎస్‌పీ) పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

అధికారులపై ఈసీ కొరడా

ఆదేశించినా స్థానిక వైకాపా నాయకుల ఒత్తిడితో కలెక్టర్ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించారనే ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుపై వేటుకు సిద్ధపడింది. .

బందరులో విఆర్ఓ సస్పెన్షన్

సార్వత్రిక ఎన్నికల దష్టిలో పెట్టుకుని నేతలు ఆరు నెలల ముందే తమ అనుకూల అధికారులను తెచ్చి పెట్టుకున్నారు. ఎన్నికల ముంగిట జరిగిన పోలీసుల బదిలీల్లో కూడా సిఫార్సులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత మచిలీపట్నంలో స్ట్రీట్‌ఫీల్డ్ (ఎస్ఎఫ్) సర్వే నెంబరుతో ఓటర్లను ఆకర్షించేందుకు దొంగ ఇంటి పట్టాలు పంపిణీ చేశారంటూ ఎన్నికల సంఘానికి విపక్షాలు ఫిర్యాదులు చేశాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు మచిలీపట్నంలోని 12 డివిజన్ విఆర్ఓ పై సస్పెన్షన్ వేటు వేశారు. దీనిపై విచారణ జరుగుతుంది. ఎంతమంది అధికారులపై వేటు పడుతుందో అని ఆందోళన ఉద్యోగ వర్గాలలో నెలకొంది.

పోలీసుల యంత్రాంగంపై ఫిర్యాదులు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉంది. కొంతమంది పోలీస్ అధికారులు, తమకు అనుకూల ప్రాంతంలో పోస్టింగ్ వేయించారనే విశ్వాసంతో అధికార పార్టీ నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కొందరు పోలీసు అధికారులపై ఎన్నికల సంఘానికి పలువురు ఫిర్యాదులు చేశారు. గతంలో పెడన నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్‌కు అనుకూలంగా పనిచేసిన పోలీసు అధికారులను ముందస్తు వ్యూహంతో ఆయన పెనమలూరుకు బదిలీ చేయించుకున్నారని విపక్ష నేతలు ఫిర్యాదు చేశాయి.



కృష్ణమూర్తికి నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : వల్లభనేని కృష్ణమూర్తి సంతాప సభ బుధవారం విజయవాడ అశోకనగర్‌లో జరిగింది. ఈ సభకు చల్లపల్లి మండల సిపిఎం నాయకులు వాకా రామచంద్రరావు, చల్లపల్లి మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, నాగేశ్వరరావు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి హాజరై కృష్ణమూర్తి చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు.

ఆకునూరులో 'జయహో బిసి'

ప్రజాశక్తి-ఉయ్యూరు : వెనుకబడిన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిసిడిక్లరేషన్ ప్రకటించారని టిడిపి రాష్ట్రఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆకునూరు గ్రామ పార్టీకార్యాలయంలో బుధవారం నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో ఆయన పాల్గొని బడుగు బలహీన వర్గాలకు జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన ద్రోహాన్ని వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గు ర్తుచేశారు. టిడిపి మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్చార్జ్ కొండా ప్రవీణ్, బీసీ సెల్ కార్యదర్శి గోపీచంద్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో ట్యాంకర్ ద్వారా మంచినీటిని పంపిణీ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఉమా మహేశ్వరరావు తెలిపారు. గ్రామ పంచాయతీ మంచి నీటిని ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా గ్రామ ప్రజలకు నిత్యం అందిస్తారు.అయితే తాగునీటి చెరువులో నీరు ఇంకిపోవడంతో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ఏర్పాటు చేసి బుధవారం నుంచి ఇంటింటికి పంచాయతీ ద్వారా తాగునీటిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-గుడివాడ : త్వరలోనే దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చూస్తామని, ఆయన ప్రధాని అయిన వెంటనే మన రాష్ట్రానికి ప్రత్యేక హోదాని ప్రకటిస్తారని, కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి అని గుడివాడ నియోజవర్గ అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వడ్డాది గోవిందరావు(రాజేష్) తెలిపారు. బుధవారం స్థానిక వడ్డాది చార్టిబుల్‌ట్రస్టు కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి శిష్టా దత్తాత్రేయులు, పట్టణ మహిళా కార్యదర్శి కాసిరెడ్డి సత్యవతితో కలసి ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీని దేశ ప్రధాని అయిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేకహోదాపైనే సంతకం చేస్తారన్నారు.

రక్తహీనత రహిత జిల్లా సాధనకు కృషి

● డిఎంహెచ్ఒ డాక్టర్ జి. గీతాబాయి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా ను రక్తహీనత రహిత జిల్లాగా చేయుటకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. గీతాబాయి పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ సమావేశ హాలులో గీతా బాయి అధ్యక్షతన జిల్లాలోని అన్ని పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో వారి నెలవారి ప్రగతి నివేదికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ రాబోయే సంవత్సర కాలంలో సాధించవలసిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రారంభం నుండే నూరు శాతం లక్ష్య సాధన కొరకు కృషి చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో మాత మరణాలను, శిశు మరణాలను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. గర్భవతుల ను 12 వారాల లోపుగా నమోదు చేసి వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, వైద్య సేవలు, కౌమారదశ పిల్లల్లో రక్తహీనత నివారణ కొరకు ఎర్ర మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు నర్సింగ్ హోమ్ ను, పని చేసే సిబ్బందిని తప్పనిసరిగా హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీలో నమోదు చేయాలని సూచించారు. రాబోయే మూడు నెలల కాలంలోవేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఆరోగ్య కేంద్రం నందు, ఉపకేంద్రం నందు క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది వద్ద ఓ ఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకొని అవసరమైన వారికి పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సీతాకుమారి, జిల్లా మలేరియా అధికారి బి రామారావు, జిల్లా ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ విజయభారతి, వైద్యాధికారి నాగ భవాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతాబాయి

కొడాలి నాని ప్రచారం

ప్రజాశక్తి-గుడివాడ : సిఎం జగన్ మోహన రెడ్డి పాలనలోనే సంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గుడివాడ 27వ వార్డు బేతవోలులో కొడాలి నాని ఎన్నికల ప్రచారం 8వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్, జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు పాలేటి చంటి, దుక్కిపాటి శశి భూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, జడ్పిటిసిలు గోళ్ళ రామకృష్ణ, కందుల దుర్గా కుమారి, ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, కొడాలి సురేష్, వైస్ ఎంపీపీలు బొట్టు నాగలక్ష్మి, పూడి సుధాకర్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ చింతల భాస్కరరావు పాల్గొన్నారు..



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని

అధికారులు నిబద్ధతతో పని చేయాలి : కొల్లు



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రశాంతంగా ఉన్న కృష్ణా జిల్లాను అధికార పక్ష నాయకులు, కొంతమంది అధికారులు కలిసి భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు. బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ నేతల అక్రమాలను ప్రోత్సహించడంతోనే జిల్లా కలెక్టర్ పై ఈసీ వేటు వేసిందన్నారు. అధికారపార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలపై తాము అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.వైసీపీ నేతలు జిల్లాలో పెద్ద ఎత్తున మట్టిని దోచుకున్నారని, అలాగే స్థానిక శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య ఓటర్ల జాబితాలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని అదేవిధంగా పెద్ద ఎత్తున దొంగ పట్టాలు ఇచ్చారని వీటన్నిటి పై ఆధారాలతో కలక్టర్ కు ఫిర్యాదు చేసిన సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు మార్గ దర్శకాలు,ఎలక్షన్ కమిషన్ సిఫార్సులను కూడా కలక్టర్ పరిగణలోకి తీసుకోలేదన్నారు. తప్పు చేసిన కొంత మంది అధికారులను సస్పెండ్ చేయమని ఆదేశించినా కలెక్టర్ పెడ చెవిన పెట్టారన్నారు. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గ కుండా నిబద్ధత పని చేయాలని లేకుంటే తీవ్ర ఇబ్బందులు పడతారని స్పష్టం చేశారు. అలాగే జిల్లా పోలీస్ శాఖను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎస్పీగా పని చేసిన జాషువా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

● అవనిగడ్డ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందే శ్రీరామ్‌మూర్తి



సంక్షేమ కార్యక్రమాల పోస్టర్ను ప్రదర్శిస్తున్న శ్రీరామ్ మూర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో ఇప్పటివరకు తెలుగు దేశం పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన చూశారని రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు కూడా ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నియమితులైన అందే శ్రీరామ్ మూర్తి ఓటర్లను కోరారు. బుధవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం బిజెపి ద్రోహం వల్ల ఆంధ్రప్రదేశ్ పూర్తిగా నష్టపోయిందన్నారు. తెలుగుదేశం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదు అన్నారు. అందువల్ల రాష్ట్రంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యల పరిష్కారం అవుతాయి అన్నారు.

త్వరలో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని ఘంటసాల జడ్పీ ఉన్నత పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలికా అభివృద్ధి అధికారి హెచ్.వనిత సూచించారు. బుధవారం స్థానిక పాఠశాలను ఆమె పరిశీలించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతుల విధిగా వత్తి విద్యా కోర్సులు అమలు చేసేలా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించిందన్నారు. హెచ్ఎం రంగవల్లి మాట్లాడుతూ కోర్సుల నిర్వహణకు విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులైన ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రాష్ట్రంలో ఐదు ఏళ్లగా కొనసాగుతున్న వైసిపి విధ్వంసానికి ముగింపు పలికేందుకే టిడిపి,బిజెపి జనసేన పొత్తు పెట్టుకున్నాయని సీనియర్ టిడిపి నేత ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు స్పష్టం చేశారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం, సింగన్నగూడెంలలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించిన కార్యాచరణ గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, మొవ్వా వేణుగోపాల్, ఆళ్ల గోపాలకృష్ణ, బీజేపీ నాయకుడు కసుకుర్తి వెంకటశాస్త్రులు, తెలుగుమహిళ కమిటీ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి వెంకటేశ్వరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, స్నేహ సంబంధాలు, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రివర్యులు మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఇనగుదురుపేట ఎం ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మచిలీపట్నం వైయస్సార్సీపీ పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, వైఎస్ఆర్సిపి మచిలీపట్నం శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు)షేక్ సలార్ దాదా,షేక్ ముస్తఫా (అచ్చాబా), మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులతో పాటు పలువురు కార్పొరేటర్లు వార్డు ఇన్చార్జులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు డ్రమ్ములు వితరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నం లోని స్థానిక నోబుల్ కాలనీ లో ఉన్న కిండర్ నాట్ హిల్ ఫే (కె ఎన్ హెచ్) బాలుర హాస్టల్ విద్యార్థులకు వేసవి కాలం తాగునీటి నిల్వ అవసరాల దృష్ట్యా 3 ప్లాస్టిక్ డ్రమ్ములు వితరణ చేశారు. వేసవి తాగునీటి కి ఇబ్బందులు పడుతున్నారని గమనించిన మైత్రీ సభ్యురాలు దీప్తి తన స్నేహితుల సహకారంతో సుమారు 3 వేల రూపాయల విలువ చేసే ప్లాస్టిక్ డ్రమ్ములను కె ఎన్ హెచ్ బాలుర వసతి గృహానికి అందజేశారు. ఈ సందర్భంగా హాస్టల్ బాలురు, యాజమాన్యం దీప్తి కి వారి మిత్ర బందానికి అలాగే మైత్రీ ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలిపారు.

మల్లవోలులో 'ప్రజాదీవెన'

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో బుధవారం ప్రజా దీవెన కార్యక్రమం పెడన నియోజకవర్గం వైసిపి శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము,ఎంపి అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ ,జెడ్పీ ఛైర్మన్ ఉప్పాల హారిక నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా దీవెన కార్యక్రమంలో పాల్గొని గడపగడపను సందర్శించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సర్పంచ్ సాంబయ్య, మోటెపల్లి రత్నారావు, కారు మంచి కామేశ్వరరావు, జక్కా ధర్మారాయుడు పాల్గొన్నారు.

బందరులో
'గడపగడపకూ మన సంక్షేమం'

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : అవినీతిరహిత. పాలన అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, తనకు బాసటగా నిలిచి మద్దతు అందచేయాలని మచిలీపట్నం నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అభ్యర్థించారు. బుధవారం మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 48 వ డివిజన్ నిజాంపేటలో గడప గడపకు సంక్షేమం కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక డివిజన్ ఇంచార్జ్ శింగంశెట్టి గోపి విశ్వ చంద్ (చందు), మచిలీపట్నం పార్లమెంటరీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ తనయుడు రామ్‌చరణ్‌తో కలిసి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటి ఇంటికి వెళ్లి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, పలు డివిజన్ల ఇన్చార్జులు, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- మోపిదేవి : మోపిదేవి మండలం మెరకనపల్లి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి మండల శాఖ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. మోపిదేవి మండలం రెడ్ క్రాస్ ఛైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు,రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, మోపిదేవి మండలం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ నాయక్ , వెంకటేశ్వరమ్మ, మెరకనపల్లి రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

టొయోటా

అర్బన్ క్రూయిజర్ టైజర్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టొయోటా కిర్లోస్కర్ మోటార్స్ నుండి సరికొత్తగా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను మార్కెట్లోకి విడుదల చేసినట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని టయోటా సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎ- ఎస్యూవీ విభాగంలోకి కంపెనీ రీ ఎంట్రీని గుర్తుచేస్తూ, పూర్తి సరికొత్త టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్ ఆధునిక స్టైలింగ్, అత్యాధునిక ఫీచర్లు, సాంకేతికతను కలిగి ఉందని తెలిపారు. పూర్తి సరికొత్త అర్బన్ క్రూయిజర్ టైజర్ 1.0 లీటర్ల టర్బో, 1.2 లీటర్ల పెట్రోల్, ఈ-సీఎన్జీ ఎంపికల్లో అందుబాటులోకి ఉందని తెలిపారు. 1.0 లీటర్ల టర్బో, 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో అందుబాటులో ఉందన్నారు. 1.2 లీటర్ల పెట్రోల్ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఇంటెలిజెంట్ గేర్ షిఫ్ట్‌లో వస్తుందని, 1.2 లీటర్ల ఈసీఎన్జీ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌లో లభిస్తుందని తెలిపారు.

శామ్‌సంగ్ గృహోపకరణాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ గృహోపకరణాల లైనప్‌ను పరిచయం చేస్తున్నట్లు శామ్‌సంగ్ సౌత్ వెస్ట్ సీఈవో జుబిన్ పార్క్ తెలిపారు. నగరంలోని ఓహోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. పర్యావరణ అనుకూల గృహాల రంగంలో గణనీయమైన పురోగతిని అందించేందుకుగాను శాంసంగ్ ప్రణాళికలను రూపొందించిందని ఇందులో భాగంగానే ప్రీమియం ఉపకరణాల విభాగంలో కస్టమర్ అంచనాలను అధిగమించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు తమ దైనందిన జీవితంలో అన్ని రకాలైన గృహోపకరణాలను అందించడమే లక్ష్యంగా శాంసంగ్ పనిచేస్తుందని ఇందులో భాగంగానే ఎప్పటికపుడు వినూత్నంగా ఉత్పత్తులను అందిస్తున్నామని తెలిపారు.

పేలు నివారణకు హైజీన్ షాంపూ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : పిల్లలలో పేను సమస్య ఎక్కువగా వేధిస్తుందని, పేల చికిత్సకు సరికొత్తగా మెడికర్ హెయిర్ హైజీన్ మిషన్ పేరుతో సరికొత్త షాంపూను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ తెలిపారు. నగరంలోని ఓహోటల్‌లో నూతన ఉత్పత్తుల గురించి తెలియచేశారు. ముఖ్యంగా పిల్లలకు పేల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు తమ నూతన ఉత్పత్తి షాంపూ గురించి కూడా తెలియచేస్తున్నామని తెలిపారు. సంప్రదాయ పేను దువ్వెన పెద్ద పేనులను మాత్రమే లక్ష్యంగా చేస్తుందని చిన్న పేలను వదిలివేస్తుందన్నారు. కొబ్బరి, వేపల 100 శాతం సహజ యాక్టివ్‌లతో పిల్లల కోసం సురక్షితమైన మెడికల్ షాంపూను అందుబాటులోకి తీసుకువచ్చామని కేవలం నాలుగు వారాల్లోనే పేను సమస్యలను తొలగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అవగాహనా కార్యక్రమాలను పాఠశాలల్లో విద్యార్థులకు తెలియచేస్తున్నామని తెలిపారు. అవగాహనా కార్యక్రమాల్లో ప్రముఖ పీడియాట్రిషన్ కన్సల్టెంట్ డాక్టర్ అమూల్య మైసూర్ పాల్గొన్నారని తెలిపారు.

బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శంఖారావంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం వీరప్పన్ అయితే ఆంధ్రప్రదేశ్ వీరప్పన్ ముఖ్యమంత్రి కాదా? అంటూ ఎంపి కేశినేని నానిని సూటిగా ప్రశ్నించారు. మైలవరం నియోజకవర్గంలో బూడిద, మట్టి, ఇసుక మాఫియాపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్, సి.బి.ఐ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణకు సిద్ధమేనా? అంటూ కేశినేని నానికి బహిరంగ సవాల్ విసిరారు. వైసిపిలో మైలవరం టికెట్ ముఖ్యమంత్రి తనకు కేటాయిస్తున్నప్పటికీ, శాసనసభ్యుని వద్ద నుంచి వార్డు సభ్యుని వరకు విలువ లేని వైసీపీలో కొనసాగటం ఇష్టం లేక తనకు వైసీపీ టికెట్ వద్దని ధిక్కార స్వరం వినిపించానన్నారు. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు మహాకూటమి నుంచి మైలవరం టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీకి దిగినట్లు స్పష్టం చేశారు.

మణిపాల్‌లో ఎక్స్‌లెన్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : న్యుమోకాకల్ వ్యాధి, ఇన్ఫ్లుయంజా వంటి పెరుగుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కారణంగా వ్యాధి తీవ్రతను తగ్గించేందుకుగానూ మణిపాల్ హాస్పటల్‌లో వ్యాక్సినేషన్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్లు హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. మణిపాల్ హాస్పటల్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దల టీకా పట్ల అవగాహన కల్పించడం, వ్యాక్సిన్‌తో నివారించగల వ్యాధులను నిరోధించడానికి ఆసుపత్రిలో సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. హాస్పటల్‌లో ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా న్యుమోకాకల్, ఇన్‌ఫ్లూఎంజా, హీమోఫిలస్, ఇన్‌ఫ్లూఎంజా టైప్ బి, హెపటైటిస్ - ఎ, హెపటైటిస్ - బి, హ్యూమన్ పాపిల్లో మావైరస్ వంటి వ్యాక్సిన్‌లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ సమగ్ర విధానం టీకా ప్రయత్నాలను మెరుగుపరచడం, మొత్తం నివారణ ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. న్యుమోకాకల్ వ్యాధి వంటి శ్వాసకోశ



మాట్లాడుతున్న వైద్యులు

ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కోవడంలో వ్యాక్సినేషన్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. టీకా నివారించగల వ్యాధులను ఎదుర్కోవడంలో ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు, రోగులు ఇద్దరినీ శక్తివంతం చేయడానికి కలసి మేము ఆసుపత్రి నందు సంపూర్ణ ఆరోగ్య సంర్‌క్షణ వాతావరణాన్ని రూపొందిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.



పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 2024 ఎలక్షన్ నేపథ్యంలో ఎన్టీఆర్ కమిషనరేట్, పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు చిలుకూరు, దాములూరు గ్రామాల్లో పోలీసులు, సిఆర్పిఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిఐ ఎం.సత్యనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వేచ్ఛాయుత ఓటింగ్‌ను వినియోగించుకోనేందుకు వీలుగా మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు సిఐ తెలిపారు.

9న ఇంద్రకీలాద్రిపై ఉగాది ఉత్సవాలు

ఇఒ కె.ఎస్.రామారావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 18వ తేదీ వరకూ క్రోధినామ సంవత్సర ఉగాది వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దుర్గగుడి ఇఒ కె.ఎస్.రామారావు తెలిపారు. బుధవారం ఆలయంలోని మహామండపం ఆరవ అంతస్తులో విలేకరుల సమావేశం జరిగింది. చైత్ర మాసంలో దేవస్థానంలో వైభవంగా నిర్వహించే 'ఉగాది, వసంత నవరాత్రోత్సవాలు, బ్రహ్మోత్సవాల' గురించి దేవస్థానం మహా మండపం 6వ అంతస్తులో ఆలయ ఇఒ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈవో తో పాటుగా వైదిక కమిటీ సభ్యులు శంకర్ శాండిల్యా, ఆర్. శ్రీనివాస శాస్త్రి , ఈఈ లింగం రమాదేవి, ఏఈవో ఎన్ రమేష్ ఉన్నారు. ఇఒ మాట్లాడుతూ ఉగాది, చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు, బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేదీ ఉగాది రోజు మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం ఉదయం 3 గంటలకు దేవతామూర్తులకు "స్నపాభిషేకంతో ప్రారంభం అవుతుందని తెలిపారు. 'వసంత నవరాత్రోత్సవాలు' సందర్భంగా ప్రత్యేక పుష్పార్చనలు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఉంటాయన్నారు. ఉభయ రుసుంలో పాల్గొనేవారు


ఉగాది వివరాలు తెలుపుతున్న ఆలయ అధికారులు

రూ. 2,500లు (దంపతులకు) చెల్లించాలన్నారు. వారికి అంతరాలయ దర్శనం ప్రసాదం, శేష వస్త్రం, రవిక, శ్రీ అమ్మవారి పెద్ద లడ్డు అందచేయనున్నట్లు తెలిపారు. 17న శ్రీరామ నవమి రోజున ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణం' ధర్మపథం కళావేదికలో జరుగుతాయని, 18వ తేదీన గురువారం వసంత నవరాత్రోత్సవాల పూర్ణాహుతితో ముగుస్తాయని తెలిపారు.

కెఎఫ్‌సి బర్గర్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కె.ఎఫ్.సి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బర్గర్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి కె.ఎం.ఎస్.రావు తెలిపారు. ఐదు విభిన్నమైన జింగర్ బర్గర్‌లను రూ.179ల ధరకు అందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ బర్గర్ ఫెస్ట్ గ్లోబల్ రుచులను ఆస్వాదించేందుకు కెఎఫ్‌సి ప్రయత్నం చేస్తుందన్నారు. టేక్ ఎ బైట్, టేక్ ఏ ఫ్లైట్‌కు సిద్ధంగా ఉండండి అనే క్యాప్షన్‌తో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. స్పైసీ నుండి క్లాసిక్, దాని నుండి తందూరీ వరకు వివిధ రుచులలో కెఎఫ్‌సి జింగర్ బర్గర్‌లను వివిధ రుచుల్లో అందిస్తుందన్నారు. వివరాలకు కెఎఫ్‌సి సంస్థ స్టోర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆర్‌యుబి నిర్మాణం పూర్తికాక ఇబ్బందులు

పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం గత ఏడు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉందని, దీంతో స్థానిక ప్రజలు నరకయాతన పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. విజయవాడ 29వ డివిజన్ మధురానగర్, ఇందిరా కాలనీ, లెక్చరర్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో మార్పు కోసం సిపిఎం పాదయాత్ర బుధవారం జరిగింది. మధురానగర్ తదితర కాలనీల అభివృద్ధిని పాలకులు పూర్తిగా విస్మరించి, దెబ్బతీశారని స్థానిక ప్రజలు నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి, టిడిపి ప్రజా ప్రతినిధులు పట్టాలు, రిజిస్ట్రేషన్ గురించి హామీలు ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రతి సమస్య పైన స్పందించి పోరాడిన సిపిఎంకు మద్దతునిస్తామని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడను తిరోగమనంలో నెట్టిన వైసిపి, బిజెపి, టిడిపి మధురానగర్ ప్రాంత ప్రజలపై పాలకులు కక్షగట్టారని అన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తి చేయటంలో వైసిపి, టిడిపి విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ప్రభుత్వం మధురానగరాన్ని అష్టదిగ్బంధనం చేసిందని విమర్శించారు. స్థానికులు ట్రాఫిక్‌తో నరకయాతన పడుతున్నారని అన్నారు. గతంలో టిడిపి, నేడు వైసిపి వేలాదిమంది ప్రజలు నివసిస్తున్న మధురానగర్, పసుపు తోట, కాలవ కట్టలు, ఇందిరా కాలనీ, లెక్చరర్స్ కాలనీ, కొబ్బరి తోట, నేతాజీ కాలనీ, తదితర ప్రాంతాలను తిరోగమనంలోకి నెట్టారని పేర్కొన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం గత ఏడు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. దీనితో స్థానిక ప్రజలు నరకయాతన పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని, ఇటువైపు జనం రావడానికి భయపడుతున్నారని విమర్శించారు. స్థానిక ప్రజానీకం ఇళు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారని, ఇంటి యజమానులు ఆర్థికంగా దెబ్బతింటున్నారని అన్నారు. ఆటోలు, ఇతర రవాణా వాహనాలు నిలిచిపోతున్నాయని, రోడ్లన్నీ దెబ్బతిని ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రతి వీధులోను పొంగిపొర్లుతోందని, అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు 24 గంటల నీటి పథకం పేరుతో పసుపు తోటలో 700 నీటి మీటర్లు బిగించారని అన్నారు. సిపిఎం అండతో స్థానిక ప్రజలు తీవ్రంగా పోరాడితే వాటిని తొలగించారని, ఎన్నికల అనంతరం మీటర్లు బిగించడానికి కుట్ర సాగుతోందని అన్నారు. ఈ ప్రాంతంలో ఆంధ్రాబ్యాంకు తొలగించడానికి కుట్రపన్నారన్నారు. వ్యాపారాలన్నీ దెబ్బతిన్నాయని, మధురా నగర్ ప్రాంత ప్రాభవాన్ని కోల్పోయిందన్నారు. ఈ ప్రాంతంలో వివిధ కాలనీలకు రిజిస్ట్రేషన్ లేవని,


స్థానికులను కలిసి మాట్లాడుతున్న బాబూరావు

గతంలోని ప్రజా ప్రతినిధులు భారాలు మోకారు తప్ప, ఇచ్చిన హామీలు నెరవేర్చక నమ్మకద్రోహం చేశారన్నారు. రైల్వే, ఇరిగేషన్, నగరపాలక సంస్థ భూములను యద్దేశ్చగా కబ్జా చేస్తున్న నేతలు. దశాబ్దాలుగా నివసిస్తున్న స్థానికులకు పట్టాలు, రిజిస్ట్రేషన్ చేయడానికి కుంటి సాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇళ్ల పట్టాలపై అనేక ఆందోళనలు సిపిఎం సాగించిందని, గతంలో మధురానగర్ వద్ద పప్పులు మిల్లు పాత బ్రిడ్జి తొలగించరాదని ఆందోళనకు ముందుభాగాన నిలిచిందన్నారు. బాబురావు నేతత్వంలో సి.పి.ఎం సాగించిన ఈ పోరాటాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు టిడిపి, వైసిపిలకు బుద్ధి చెప్పి సిపిఎం గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ పాదయాత్రలో సి.పి.ఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణరావు నాయకులు పి.కష్ణమూర్తి, వైకష్ణ, చిన్న, రామారావు, మురళి, ఎం.శ్రీనివాస్, ఆశా, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.